క్లుప్తంగా

రేపటి నుంచి లక్ష్మీనృసింహ ఉత్సవాలు

దోమ: ఈ నెల 27వ తేది నుంచి మల్లేపల్లి గ్రామంలో లక్ష్మీనృసింహ ఉత్సవాలు జరుగుతాయని సర్పంచ్ దొడ్ల అంజిలయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ధ్వజారోహణం, అంజనేయస్వామి అభిషేకం, గణపతి హోమం నిర్వహిస్తామని, మంగళవారం స్వామి వారికి అభిషేకం, చండి హోమం, కల్యాణోత్సవం, ఉయ్యాల పల్లకీ సేవ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.

సర్పంచిని పరామర్శించిన ఎమ్మెల్యే



పకీరప్పను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

కొడంగల్: మండల పరిధిలోని లక్ష్మీపల్లి సర్పంచు చిన్న పకీరప్పను ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి శనివారం పరామర్శించారు. పకీరప్ప కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ.. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ఆసుపత్రికి చేరుకొని వైద్యులతో మాట్లాడారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఎమ్మెల్యే వెంట కొడంగల్ మున్సిపల్ కౌన్సిలర్ మధుయాదవ్, సర్పంచు అంజద్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

హిందూ సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి

కుల్కచర్ల: హిందూ సంప్రదాయాలను మనమే పరిరక్షించుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రహ్లాదరావు, పరిగి నియోజకవర్గ నాయకుడు మిట్టపరమేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం మరికల్ గ్రామంలో కోటచింతల బసవేశ్వర స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్‌లను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో హిందూ దేవుళ్లను కించపరచడం మొదలు మన సంస్కృతి, సంప్రదాయాలపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో మన సంస్కృతి, ఆచార సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని సూచించారు. కార్యక్రమంలో మైపాల్, హరి, రాజశేఖర్, రాజేష్, చిన్న, మల్లికార్జున్, మల్లేశ్, నవీన్, యశ్వంత్, కృష్ణాచారి, వేణు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువు

బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు



తాండూరు టౌన్: తెలంగాణలో మహిళలకు భద్రత కరువైందని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహు శ్రీలత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాకతీయ మెడికల్ కళాశాలలో చదువుతున్న ప్రీతి అనే విద్యార్థినిపై సీనియర్ విద్యార్థి సైఫ్ వేధించడంతో ఆమె ఆత్మహత్యాయత్నం చేయడం బాధకరమని, యాలాల మండల పరిధిలో పదో తరగతి విద్యార్థినిపై అత్యాచార సంఘటన సిగ్గుచేటన్నారు. సైఫ్‌ను కఠినంగా శిక్షించడంతో పాటు మహిళలపై అఘాయిత్యాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. మహిళల రక్షణలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆరోపించారు. పదో తరగతి విద్యార్థినిపై జరిగిన ఘటన హేయమైనదని, నిందితునికి కఠిన శిక్ష పడేలా చూడాలని, అలాగే బాధిత విద్యార్థినికి ప్రభుత్వం రూ.10 లక్షల ఆర్థిక సాయం అందజేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల ప్రగతి బాధ్యత ఉపాధ్యాయులదే

రంగారెడ్డి జిల్లా విద్యాధికారి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ

మొయినాబాద్: విద్యార్థులు ప్రగతి సాధన విషయంలో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీందర్ రావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం జరిగిన టీచర్స్, పేరెంట్స్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టివారికి అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలన్నారు. విద్యార్థుల ప్రగతిపై ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా సహకరించాలన్నారు. పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన విద్యార్థికి హోంవర్క్ ఏమి ఇచ్చారని తెలుసుకోవాలన్నారు. విద్యార్థుల ముందు టీవీ పెట్టి సినిమాలు, సీరియళ్లు చూడవద్దని, సెల్‌ఫోన్‌లు ఇవ్వొద్దని సూచించారు. విద్యార్థులందరు మంచి ప్రగతి సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మండల విద్యాధికారి వెంకటయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విరుచుకుపడుతున్న వీధికుక్కలు

కుక్కల బెడద ఎక్కువైంది. ఏ వీధిలో చూసినా గుంపులుగా సంచరిస్తూ.. భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. నగటు జీవి, మనిషిపై అకారణంగా దాడులకు తెగబడుతున్నాయి. వెంటబడి తరుముతున్నాయి. కనిపించిన వారిపై విచక్షణా రహితంగా దాడి చేస్తూ దడపుట్టిస్తున్నాయి. దీంతో జనాలు రోడ్లపైకి వచ్చేందుకు భయపడుతున్నారు.

- బెంబేలెత్తిస్తున్న గ్రామ సింహాలు
- గుంపులుగా వీధుల్లో వీరవిహారం
- రోడ్డెక్కాలంటే జంకుతున్న జనాలు
- పట్టించుకోని అధికారులు



దౌల్తాబాద్: పల్లెలు, పట్టణాలు, నగరాలు అని తేడా లేకుండా గ్రామ సింహాల బెడద ఎక్కువైంది. గతంలో వానర సైన్యంతో బెంబేలెత్తిపోయిన పల్లె ప్రజలు.. ఇప్పుడు కుక్కల గుంపులతో జడుసుకుంటున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో శునకాల వరుస దాడుల నేపథ్యంలో అవి కనబడితే పారిపోయినంత పనిచేస్తున్నారు. పట్టపగలే కుక్కలు మనుషులు, మూగజీవాలపై దాడులు చేస్తున్నా.. వాటి నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ప్రజలు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పిల్లలను పాఠశాలలకు పంపించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు.

తరచూ ఘటనలు..

మండలంలో వీధి కుక్కల దాడులు పెరిగిపోయాయి. ఇటీవల మండల కేంద్రంలో ఓ వృద్ధురాలిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. అలాగే ఓ వ్యక్తిపై, నాలుగేళ్ల చిన్నారిపై ఎగబడ్డాయి. 8 నెలల క్రితం ఓ రెండేళ్ల చిన్నారిపై దాడి చేయడంతో ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. దౌల్తాబాద్‌లో రెండు లేగదూడలపై దాడి చేయడంతో అవి మృత్యువాత పడ్డాయి. నాలుగు నెలల క్రితం దౌల్తాబాద్‌కు చెందిన నరేష్ కుక్కకాటుకు గురయ్యాడు. మండల కేంద్రంలో గొర్రెల మందపై దాడి చేసి 25 జీవాలను పొట్టన పెట్టుకున్నాయి. ద్విచక్ర వాహనదారులను వెంబడించి గాయపరుస్తున్నాయి. ఇలా ప్రజలతో పాటు మూగజీవాలైన మేకలు, గొర్రెలు, పశువులపై గుర్రుమంటూ దాడ్ తీయిస్తున్నాయి.

చీకటి పడితే అంతే..

పనులు ముగించుకుని అర్ధరాత్రి నివాసాలకు వచ్చే వారిపై వీధి కుక్కల దాడులు తీవ్రమయ్యాయి. రాత్రి పూట వాహనాలపై వెళ్తున్న వారిని వెంబడించి మరీ దాడి చేస్తున్నాయి. తెల్లవారజామున పొలాలకు వెళ్లే రైతులు, పనుల కోసం బయటకు వెళ్లే వారిపై గుంపులుగా తెగబడుతున్నాయి.

పట్టించుకోని యంత్రాంగం

వీధి కుక్కల దాడులు తీవ్రమైనా.. అధికార యంత్రాంగం.. వాటిని నియంత్రించడంలో విఫలమవుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలో కుక్కలు తరలించే సిబ్బందిని నియమించేందుకు అధికారులు చర్యలు తీసుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మురిసిన మరియమ్మ

కలెక్టర్ పుణ్యమా అని పాసుబుక్కు వచ్చింది



కొత్త పట్టా బుక్ జిరాక్స్ చూపిస్తున్న మరియమ్మ

పెద్దేముల్: పట్టా పాసుబుక్కు కోసం ఓ మహిళా రైతు ఏడాదిన్నర నుంచి రెవెన్యూ కార్యాలయం చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా ఎవరూ పట్టించుకోలేదు. తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాని పరిస్థితి. అయితే కొత్త కలెక్టర్ నారాయణరెడ్డి పుణ్యమా అని తనకు పాసుబుక్కు వచ్చిందని మహిళా రైతు మరియమ్మ తెగ మురిసిపోతోంది. పెద్దేముల్ మండల కొండాపూర్‌కు చెందిన బుడిగ జంగం మరియమ్మ సర్వే నంబర్ 46లో 3.20 ఎకరాలకు సంబంధించిన పట్టా పాసుబుక్కు కోసం ఏడాదిన్నర నుంచి చేయని ప్రయత్నము లేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆమె పాట్లు అన్నీఇన్నీ కావు. తహసీల్దార్ కార్యాలయానికి ఎప్పుడు వెళ్లి అడిగినా కలెక్టర్ కార్యాలయంలో ఫైలు పెండింగ్‌లో ఉందని సమాధానం వచ్చేది. అయితే.. ఇటీవల జిల్లాకు కొత్తగా కలెక్టర్ రావడం.. ఆయన దూకుడుగా వ్యవహరిస్తుండటంతో అధికారుల్లో కదలిక వచ్చింది. దీంతో పెండింగ్ ఫైలన్నీ చకచకా పరిష్కారానికి నోచుకుంటున్నాయి. ఈ క్రమంలో రైతు మరియమ్మకు సంబంధించిన ఫైలుకు మోక్షం లభించింది. శనివారం ఆమెకు కబురందింది. ఇదిగో నీ పాసుబుక్కు జిరాక్స్ తీసుకో అని ఆర్ఐ రాజిరెడ్డి చెప్పడంతో ఆమె విస్మయం చెందింది. ఇది కలనా.. నిజమా అని ఒక్క నిమిషం ఆలోచనలో పడింది. నెల రోజుల్లో పాసుబుక్కు అందుతుందని, వ్యవసాయ అధికారులను సంప్రదించి రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. దీంతో మరియమ్మ ఆనందానికి అవధులు లేకుండా పోయింది

విద్యార్థులను ప్రోత్సహించండి

ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణకుమార్

మర్పల్లి: పరీక్షల సమయంలో విద్యార్థులకు ఎలాంటి ఇంటి పనులు చెప్పరాదని మర్పల్లి ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణకుమార్ తల్లి తండ్రులకు సూచించారు. శనివారం ఆదర్శపాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం 10వ తరగతి, ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల చేసిందని, పాఠశాల వదిలిన తర్వాత విద్యార్థులు ఇళ్ల వద్ద చదువుకొనే విధంగా పోత్సహించాలని ఆయన తల్లిదండ్రులకు చెప్పారు. ముఖ్యంగా విద్యార్థులు పరీక్షల సమయంలో సమయ పాలన పాటించి, పరీక్షలకు హాజరయ్యే విధంగా తల్లిదండ్రులు చూడాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యకు కేరాఫ్ సర్కారు బడి

జిల్లా విద్య పర్యవేక్షణ అధికారి రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి రవికుమార్

పూడూరు: నాణ్యమైన విద్యకు సర్కారు బడులే కేరాఫ్ అడ్రస్ అని జిల్లా విద్య పర్యవేక్షణ అధికారి రవికుమార్ అన్నారు. శనివారం మండల పరిధిలోని కడుమూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పీటీఎం సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల చదువు పట్ల ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న సమయాన్ని దృష్టిలో పెట్టుకొని, విద్యార్థులకు సమయానుకూలంగా బోధన చెప్పాలన్నారు. మనఊరు–మనబడి కార్యక్రమం ద్వారా జరుగుతున్న పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కృష్ణ, ఎస్ఎంసీ చైర్మన్ వెంకటస్వామి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మధుసూదన్, ఎస్ఎంసీ చైర్మన్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మినీ స్టేడియం కలేనా?

- ప్రతిపాదనలకే పరిమితం
- మైదానం లేక క్రీడాకారుల ఇబ్బంది
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు (ఫైల్)

దౌల్తాబాద్: మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లో మినీ స్టేడియం ఏర్పాటు కలగానే మిగిలిపోయింది. స్టేడియం ఏర్పాటు పనులు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. సరైన మైదానం లేక క్రీడాకారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో 33 గ్రామపంచాయతీలు ఉండగా.. ఎక్కడా సరైన ఆటస్థలం లేదు. కొన్నేళ్లుగా స్టేడియం ఏర్పాటుకు ప్రకటనలు వెలువడుతున్నా కార్యరూపం దాల్చడంలేదు. ఏటా నిర్వహించే టోర్నమెంటు ముగింపు సభల్లో ఈ విషయం నాయకులు ప్రస్తావనకు తెచ్చినప్పటికీ.. ఆతరువాత ఆ ఊసే ఎత్తడం లేదు. దీంతో క్రీడాకారులు పొలాల్లో, పాఠశాల మైదానంలో ఎక్కడ ఖాళీ స్థలం దొరికితే అక్కడ ప్రాక్టీస్ చేస్తున్నారు.

ఈవెంట్స్ ప్రాక్టీస్‌కు ఇబ్బంది

పోలీస్, ఫారెస్టు పీఈటీ తదితర ఉద్యోగాల పోటీ పరీక్షల లాంగ్‌జంప్, హైజంప్, రన్నింగ్ తదితర ఈవెంట్స్ ప్రాక్టీస్ చేసేందుకు క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం దౌల్తాబాద్‌లో హైస్కూల్ పరిధిలో కొంతమేర మైదానం ఉంది. అయితే మైదానం ప్రాంతం ఎత్తుపల్లాలుగా ఉంది. వర్షం పడితే బురదమయంగా మారుతోంది. అయితే కొంతమంది యువకులు మైదానంలోనే ప్రాక్టీస్ చేస్తున్నారు. ఏటా మండల స్థాయిలో నిర్వహించే క్రీడా పోటీల ముగింపు సభ నిర్వహిస్తుంటారు. ఇక్కడికి వచ్చిన ప్రజాప్రతినిధులు మినీస్టేడియం ఏర్పాటు చేయిస్తామని మాటలు చెప్పి వెళ్లిపోతున్నారని, ఆ తరువాత పట్టించుకోవడం లేదంటూ ఆరోపిస్తున్నారు. యువకులకు వ్యాయామం, క్రీడలకు క్రీడా మైదానం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా మండల అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మండల కేంద్రంలో క్రీడా మైదానాన్ని మంజూరు చేసి, క్రీడావసతులు కల్పించాలని క్రీడాకారులు, మండల ప్రజలు కోరుతున్నారు.

మినీస్టేడియం నిర్మించాలి



మండలంలో చాలా మంది యువకులకు క్రీడామైదానం లేక ఇబ్బంది పడుతున్నారు. ఆటల పోటీల్లో పాల్గొనాలంటే.. ముందుగా ప్రాక్టీస్ చేయాలి. అందుకు మినీస్టేడియం కావాలి. మైదానం సౌకర్యం లేక పలువురు క్రీడాకారులు పొలాలు, ఖాళీ స్థలాల్లో ఆడుతున్నారు. ఈ విషయం పాలకులు గుర్తించి, మినీ స్టేడియం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

– సూరారం సాయిలు, దౌల్తాబాద్

ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు

బహుజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ

పరిగి: విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై తాను నిరంతరం పోరాటం చేస్తానని బహుజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ చెప్పారు. శనివారం పట్టణ కేంద్రంతో పాటు సుల్తాన్‌పూర్, చిట్యాల తదితర పాఠశాలల్లో నిర్వహించిన ఎమ్మెల్సీ ప్రచారంలో ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యలపై తాము ఎన్నో పోరాటాలు చేసి సమస్యలను పరిష్కరించామని తెలిపారు. గతంలో గెలుపొందిన వారు సొంత లాభం కోసం పదవులను అడ్డం పెట్టుకొని పనులు చేసుకున్నారే తప్ప ఉపాధ్యాయుల సమస్యలను ఎవరూ పట్టించుకోలేదని ఆరోపించారు. బహుజన ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బహుజన బిడ్డ శివకుమార్ బరిలో ఉన్నారని, వారికి మొదటి ప్రాధాన్యతగా ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ ధనేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు చర్యలు

ఎంపీడీఓ లక్ష్మీనారాయణ



ప్రకృతి వనంలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ తదితరులు

బంట్వారం: మొక్కల సంరక్షణ కోసం తగిన చర్యలు తీసుకుంటున్నట్లు కోట్‌పల్లి ఎంపీడీఓ లక్ష్మీనారాయణ చెప్పారు. శనివారం ఆయన ఎన్కెపల్లి శివారులోని బృహత్ పల్లెప్రకృతి వనాన్ని సందర్శించి మాట్లాడారు. ఇటీవల ప్రకృతి వనం సమీపంలోని పొలాలకు నిప్పంటుకొని మంటలు వ్యాపించాయని, ఆ మంటల తాకిడికి ప్రకృతి వనంలోని మొక్కల ఆకులు వాడిపోయి కాండం పచ్చగానే ఉందని తెలిపారు. మొక్కలన్నింటినీ మళ్లీ బతికించేలా క్రమం తప్పకుండా ట్యాంకర్ ద్వారా నీరు పట్టిస్తున్నామని చెప్పారు. పాక్షికంగా దెబ్బతిన్న మొక్కల కాండలు బాగానే ఉన్నాయని, వాటన్నింటిని కాపాడుకుంటామన్నారు. మంటల ఉధృతికి వనంలో ఇప్పటి వరకు ఎలాంటి నష్టం జరగలేదని, ప్రతి మొక్కను బతికించుకుంటామన్నారు. ఇందుకు అవసరమైన చర్యలు ఎప్పటికప్పుడు తీసుకుంటున్నామని ఎంపీడీఓ వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీఓ డానియల్, ఈజీఎస్ ఏపీఓ ఎలీష, ఎన్కెపల్లి పంచాయతీ కార్యదర్శి రవి పాల్గొన్నారు.

ఉర్సు ఉత్సవాలు ప్రారంభం

పూడూరు: మండల పరిధిలోని మేడికొండ పంచాయతీ పరిధిలో ఉర్సేషరీఫ్ దర్గా ఉత్సవాలు సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు అనంత్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా ప్రారంభించారు. శనివారం ఉదయం కవ్వాలి, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. 26న ఆదివారం(నేడు) నిర్వహించే మిలాది నబీ, సలాం కార్యక్రమాలకు ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి రానున్నారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

నేటి నుంచి..

దోమ: మండల పరిధిలోని తిమ్మాయిపల్లి గ్రామంలో యాపీర్ సయ్యది 18వ ఉర్సు ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయని నిర్వాహకుడు సిరాజుద్దీన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం గంధం, చందపూజ, సోమవారం ఖతమ్ ఖురాన్, కవ్వాలి, దీపారాధన, భజన కార్యక్రమాలు ఉంటాయని ఆయన తెలిపారు. ఈ ఉత్సవాలకు మండల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్

పరిగి: ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ.. రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దారని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్ అన్నారు. పట్టణ కేంద్రానికి చెందిన దోమ వెంకటేశ్ అనారోగ్యానికి గురికావడంతో చికిత్స చేయించుకున్నాడు. దీంతో బాధితులు సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా రూ.1 లక్ష సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరయింది. దీంతో ఆ చెక్కును శనివారం బాధితునికి అందజేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలకు న్యాయం చేస్తుందని, సీఎం సహాయనిధి ద్వారా ఎంతో మంది పేద ప్రజలకు మెరుగైన చికిత్స అందుతుందని తెలిపారు. గతంలో అనారోగ్య సమస్యలు వస్తే.. డబ్బులు లేక చికిత్స చేయించుకోలేక ఎంతో మంది నిరుపేదలు ఇబ్బంది పడేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని, సీఎంఆర్‌ఎఫ్ అందరికీ అండగా ఉందని నిలుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలి



విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్ఆర్‌టీపీ నాయకులు

పరిగి: ప్రభుత్వం 24గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెబుతూ రైతులను మోసం చేస్తుందని, సాగుకు నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని వైఎస్ఆర్‌టీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్లు కోళ్ల యాదయ్య, నరేందర్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పట్టణ కేంద్రంలోని ఏడీఏ కార్యాలయంలోని అధికారులకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యుత్ కోతల వలన రైతులు ఇబ్బందులు పడుతున్నారని, సరఫరా సక్రమంగా లేకపోవడంతో పంటలు ఎండి పోతున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తుందని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో ఎక్కడా జరగడం లేదని ఆరోపించారు. రైతులకు 24గంటల పాటు విద్యుత్ సరఫరా చేసేంత వరకు పోరాటం చేస్తూనే ఉంటామని తెలిపారు. ఎండలు ముదురుతున్న వేళ.. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, రఘు, రాములు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీని అంతమొందించాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రహ్లాదరావు



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ప్రహ్లాదరావు తదితరులు

దోమ: తెలంగాణలో ప్రజలు బీఆర్ఎస్ పార్టీని అంతమొందించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు అన్నారు. శనివారం మండల పరిధిలోని దొంగ ఎన్కేపల్లి, మైలారం గ్రామాల్లో శక్తి కేంద్రం ఇన్‌చార్జి సత్యనారాయణ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాగోస–బీజేపీ భరోసా శక్తి కేంద్రం కార్నర్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రజలను మోసం చేస్తూ పాలిస్తున్నారని ప్రహ్లాదరావు ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చకుండా కాలం వెళ్లదీస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో పేదలకు ఇవ్వాల్సిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, రైతులకు రూ.లక్ష రుణమాఫీ ఇవ్వడంలో సీఎం కేసీఆర్ పూర్తిగా విఫలం అయ్యారని మండిపడ్డారు. ప్రజలు రాబోవు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. బీజేపీ కార్యకర్తలు నిరంతరం గ్రామాల్లో క్షేత్రస్థాయిలో తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ పటిష్టతకు పాటుపడాలని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, జిల్లా కార్యదర్శి కేశవులు, అసెంబ్లీ కన్వీనర్ హరికృష్ణ, శక్తి కార్నార్ మండల ఇన్‌చార్జి పెంటయ్య, నేతలు నర్సింహులు, కృష్ణారెడ్డి, అంజనేయులు, గోపాల్, నాగేంద్ర, నర్సింహులు, మొగులయ్య, బీరప్ప పాల్గొన్నారు.

తాండూరులో బీజేపీ..

తాండూరు రూరల్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాండూరులో బీజేపీ అభ్యర్థి గెలుపు తథ్యమని ఆ పార్టీ మహిళ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పటేల్ జయశ్రీ అన్నారు. శనివారం మండల పరిధిలోని కరన్‌కోట్ గ్రామంలో నిర్వహించిన ప్రజాగోస–బీజేపీ భరోస యాత్ర కార్నర్ మిటింగులో ఆమె మాట్లాడారు. తాండూరులో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే వర్గాల ద్వారా అభివృద్ధి కుంటుపడిందని, ఇద్దరు నేతలు కాన్వాయ్ రాజకీయం చేస్తున్నారని.. ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బీఆర్ఎస్‌పై రాష్ట్ర ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, బీజేపీని ఆదరిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శేఖాపూరం అంజనేయులు, జిల్లా కార్యదర్శి భద్రేశ్వర్, నాయకులు శ్రీనివాస్, చిరంజీవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- బీఆర్ఎస్, బీజేపీ ప్రజలకు చేసిందేమీ లేదు
- మాజీమంత్రి ప్రసాద్‌కుమార్



గ్రామస్తులతో మాట్లాడుతున్న మాజీమంత్రి

అనంతగిరి: వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం వికారాబాద్ మండలం పీలారం గ్రామంలో చేపట్టిన హాత్‌సే హాత్ కార్యక్రమంలో భాగంగా ఆయన గ్రామంలో ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ గతంలో చేపట్టిన కార్యక్రమాలు, అధికారంలోకి వస్తే చేపట్టే కార్యక్రమాలను ప్రజలకు వివరించిన అనంతరం మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వంట గ్యాస్‌ను రూ500లకు అందిస్తామని, రైతులకు ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. అసైన్డ్ భూములపై అన్ని హక్కులు కల్పిస్తామన్నారు. రెండు సార్లు అధికారం చేపట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పేదలకు చేసిందేమీ లేదని విమర్శించారు. తెలంగాణ ఇచ్చింది సోనియాగాంధీ అని, ప్రజలంతా ఒక్కసారి ఆలోచించి కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు.